నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, గురువారం 30 జనవరి 2025 | MEDAK

# పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

- బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి



కర్నాల్‌పల్లిలో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, జనవరి 29: ప్రజా సంక్షేమం, పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం కర్నాల్‌పల్లిలో మీడియాతో వారు మాట్లాడారు. ఎన్నికల్లో మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలను మోసం చేసిందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రజా పాలన పేరుతో మరోసారి ప్రజలను మోసం చేస్తున్నదని ధ్వజమెత్తారు. గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, రైతుబంధు, తులం బంగారం, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త పింఛన్లు ఇచ్చేవరకు ప్రభుత్వంతో పోరాడుతామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు చేయడం తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వడం లేదని మండిపడ్డారు.

# భద్రత కల్పించాలని ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నర్సాపూర్, జనవరి 29: గ్రామసభల్లో ప్రజల నుంచి భద్రత కల్పించాలని మండలంలోని పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎస్సై లింగంనకు ఫిర్యాదు చేశారు. గ్రామసభల్లో ప్రజలు ప్రభుత్వ పథకాల గురించి అసభ్య పదజాలంతో తమను దూషిస్తున్నారని, వారి నుంచి భద్రత కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవో కలిసి తమకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై లింగం తెలిపారు. గతంలో జక్కపలి, నత్నాయిపల్లి, లింగాపూర్, రాంచంద్రాపూర్ పంచాయతీ కార్యదర్శులను ఆయా గ్రామస్తులు కొందరు అసభ్య పదజాలంతో దూషించారని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఫిర్యాదులో వారు పేర్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తే, అసభ్యంగా ప్రవర్తించిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# భూసేకరణ వేగంగా పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 29: రంగనాయక సాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్ల డిస్ట్రిబ్యూషన్ కెనాల్ పనులకు భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రిజర్వాయర్ కెనాల్ గురించి పూర్తి వివరాలను కలెక్టర్‌కి వివరించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ రిజర్వాయర్లకు సంబంధించి మేజర్ కెనాల్స్ పనులు దాదాపు పూర్తయ్యాయని, మైనర్, సబ్ మైనర్ కెనాల్స్ నిర్మాణానికి భూసేకరణ పూర్తిచేస్తే జిల్లాలో ఆయకట్టు గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. భూసేకరణకు ఒక్కో గ్రామంలో ఒక్కో కారణం చేత అడ్డంకులు ఎదురవుతున్నందున, అన్ని విషయాలను నోట్ చేసుకొని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పక్కా ప్రణాళికతో ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కాలువల వల్ల జరిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ భూసేకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీత, ఆర్డీవో సదానందం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్.. బాంచెన్



గొల్ల శంకరమ్మ, మొగ్దుంపల్లి



ముంతాజ్ బేగం, మొగ్దుంపల్లి

మునిపల్లి, జనవరి 29: ఆసరా పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మొగ్దుంపల్లికి చెందిన వృద్ధురాళ్లు గొల్ల శంకరమ్మ (80), ముంతాజ్ బేగం (62) కోరుతున్నారు. పింఛన్ కోసం పది నెలల క్రితం తాము అధికారులకు దరఖాస్తులు చేసుకున్నామని, కానీ.. తమకు పింఛన్ మంజూరు కాలేదని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ దరఖాస్తులను అధికారులు పరిశీలించడం లేదని, పింఛన్‌కు అర్హులైనప్పటికీ మంజూరు కావడం లేదని వాపోయారు. వృద్ధాప్యంలో తమకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని అధికారులను వారు కోరుతున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి తమకు పింఛన్ మంజూరు చేయించాలని వృద్ధురాళ్లు గొల్ల శంకరమ్మ, ముంతాజ్‌బేగం విజ్ఞప్తి చేశారు.

# విహాన్‌రామ్‌కు గవర్నర్ ప్రశంసలు



విహాన్‌రామ్‌కు గడియారాన్ని బహూకరిస్తున్న గవర్నర్

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 29: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం హనుమతండాకు చెందిన జాటోత్ వాణి–తిరుపతినాయక్ దంపతుల కుమారుడు ఎనిమిదేండ్ల జాటోత్ విహాన్‌రామ్ ఈనెల 16న ఆఫ్రికా ఖండంలోని ఎత్తైన శిఖరం కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. విహాన్‌రామ్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాజ్‌భవన్‌కు ఆహ్వానించారు. మంగళవారం విహాన్‌రామ్ తన కుటుంబీకులు, కోచ్ లెంకల మహిపాల్‌రెడ్డి, స్పాన్సర్ గుగులోత్ రజితతో కలిసి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విహాన్‌రామ్‌ను గవర్నర్ అభినందించి, చేతి గడియారాన్ని బహూకరించారు. చిన్నవయస్సులోనే సాహసోపేతమైన పర్వత అధిరోహణను ఎంచుకున్నందుకు ప్రశంసించారు. వచ్చేనెలలో ఆస్ట్రేలియాలోని కోషియాష్కో పర్వతాన్ని అధిరోహించనున్నట్లు గవర్నర్‌కు విహాన్‌రామ్ వివరించారు.

# మోగిన నగారా

## శాసనమండలి ఎన్నికల షెడ్యూల్ విడుదల

- పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు
- ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- నామినేషన్లకు ఫిబ్రవరి 10 చివరి తేదీ
- నామినేషన్ల ఉపసంహరణ గడువు ఫిబ్రవరి 13
- ఫిబ్రవరి 27న పోలింగ్.. మార్చి 3న ఓట్ల లెక్కింపు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో పట్టభద్రులు 64,701 మంది
- ఉపాధ్యాయు ఎమ్మెల్సీకి 6,921 మంది ఓటర్లు



సిద్దిపేట, జనవరి 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి బుధవారం ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. పట్టభద్రుల స్థానం నుంచి ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తమ్ రెడ్డి కొనసాగుతున్నారు. ఈ ఏడాది మార్చి 29న వీరి పదవీ కాలం ముగియనున్నది. ఎన్నికల సంఘం విడుదల చేసిన తేదీల ప్రకారం ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి, అదేరోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు.నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఫిబ్రవరి 10, నామినేషన్ల ఉపసంహరణ గడువు ఫిబ్రవరి 13, ఫిబ్రవరి 27 పోలింగ్, మార్చి 3న ఓట్ల తెక్కింపు జరుగుతుంది. ఈ మేరకు షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. 2019 ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 17 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. ఈసారి ఆ సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే తమ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ప్రధాన పార్టీలు నిమగ్నమయ్యాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీతో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు రంగంలో ఉండనున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానం 15 కొత్త జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. దీంతో ఎక్కువ మంది అభ్యర్థులు రంగంలో ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ ఎమ్మెల్సీ స్థానం పరిధిలో 271 మండలాలు, 43 శాసనసభ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. పీఆర్‌టీయూ అభ్యర్థిగా వంగ మహేందర్‌రెడ్డిని అధికారికంగా ప్రకటించడంతో ఆయన ప్రచారాన్ని ప్రారంభించారు. ఇతర పార్టీలు తమ అభ్యర్థులను రంగంలోకి దింపుతున్నాయి. ఆయా ఉపాధ్యాయ సంఘాలు తమ అభ్యర్థులను రంగంలోకి దింపుతున్నాయి.

### ఉమ్మడి మెదక్‌లో 71,622 ఓట్లు

ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం ఉమ్మడి మెదక్ జిల్లాలో పట్టభద్రులు 64,701 మంది ఉన్నారు. వీరిలో 20,809 మంది మహిళలు, 43,892 మంది పురుషులు ఉన్నారు. అత్యధికంగా సిద్దిపేట జిల్లాలో 31,546 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 6,921 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,722 మంది మహిళలు, 4,197 మంది పురుషులు ఉన్నారు. అత్యధికంగా సిద్దిపేట జిల్లాలోనే ఉన్నారు. మొత్తంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కలిపి ఓటర్ల సంఖ్యను చూసుకుంటే ఉమ్మడి మెదక్ జిల్లాలో 71,622 మంది ఉన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 71 మండలాలు ఉండగా, 102 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటిలో సిద్దిపేటలో 22 మండలాల్లో 40 పోలింగ్ కేంద్రాలు, మెదక్‌లో 21 మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలు, సంగారెడ్డి జిల్లాలో 28 మండలాల్లో 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

**జిల్లాల వారీగా పట్టభద్రుల ఓటర్లు**

| జిల్లా | మహిళలు | పురుషులు | మొత్తం |
|---|---|---|---|
| సిద్దిపేట | 10,624 | 20.922 | 31,546 |
| మెదక్ | 3,420 | 8,533 | 11,953 |
| సంగారెడ్డి | 6,765 | 14,437 | 21,202 |
| మొత్తం | 20,809 | 43,892 | 64,701 |

**జిల్లాల వారీగా ఉపాధ్యాయుల ఓటర్లు**

| జిల్లా | మహిళలు | పురుషులు | మొత్తం |
|---|---|---|---|
| సిద్దిపేట | 1,104 | 1,948 | 3,052 |
| మెదక్ | 515 | 766 | 1,281 |
| సంగారెడ్డి | 1,103 | 1,485 | 2,588 |
| మొత్తం | 2,722 | 4,197 | 6,921 |

**2019 ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రకారం**
(పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మొత్తం ఓట్లు)

| విభాగం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| ఉపాధ్యాయ | 15,892 | 7,322 | - | 23,214 |
| పట్టభద్రులు | 1,35,218 | 61,077 | 26 | 1,96,321 |

# రైతులకు సాగునీటి కష్టాలు

## శిథిలావస్థలో ఏనుగుల చెరువు కాలువ, తూము

- సమృద్ధిగా నీరున్నా ఆయకట్టుకు అందని దుస్థితి
- మరమ్మతుల కోసం రైతులు ఎదురుచూపులు



ఏనుగుల చెరువు కాలువలో పేరుకుపోయిన గడ్డి, పిచ్చిమొక్కలు

ఝరాసంగం, జనవరి 29: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం మేదపల్లి గ్రామ శివారులోని ఏనుగుల చెరువులో సమృద్ధిగా నీరున్నా ఆయకట్టుకు వాడుకోలేని దుస్థితి నెలకొన్నది. చెరువు కాలువ, తూము శిథిలావస్థకు చేరడంతో నీరు అందే పరిస్థితి లేదు. ఏనుగుల చెరువు కింద 107 ఎకరాలకు ఆయకట్టు ఉంది. మరమ్మతులకు నోచుకోకపోవడంతో కాలువలో గడ్డి, పిచ్చిమొక్కలు, మట్టి నిండిపోయి నీరు ముందుకు వెళ్లలేని విధంగా తయారైంది. కేవలం 27 ఎకరాలకు మాత్రమే నీరు అందుతున్నది. ఏడాదిగా నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించడంతో కాలువ ఆనవాళ్లు కనిపించని స్థితిలో గడ్డితో నిండిపోయింది. కాలువ, తూముకు మరమ్మతులు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేసి పూర్తి ఆయకట్టుకు నీరందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ శాఖ ఏఈ జానకీరామ్‌ను వివరణ కోరగా.. సీసీ కాలువ, తూము మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.



శిథిలావస్థలో ఉన్న ఏనుగుల చెరువు తూము

### వెంటనే మరమ్మతులు చేపట్టాలి



మాఊరి శివారులోని ఏనుగుల చెరువు అతి పురాతనమైంది. దీని కింద 107 ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ పావుశాతం పొలాలకు కూడా నీరు సరిగ్గా అందడం లేదు. చెరువులో పుష్కలంగా నీరున్నా కాలువకు, తూములకు మరమ్మతులు చేయకపోవడంతో మా పొలాలకు నీరు రావడం లేదు. దిక్కుతోచక వర్షాధార పంటలు వేసుకుంటున్నాం. ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేయించాలి.

– సంగమేశ్వర్, రైతు

# భక్తిశ్రద్ధలతో రేణుకాఎల్లమ్మ కల్యాణం



కర్నాల్‌పల్లి రేణుకాఎల్లమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు

- అమ్మవారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

చేగుంట, జనవరి 29 : మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లి రేణుకాఎల్లమ్మ జాతర బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కర్నాల్‌పల్లి గౌడసంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రేణుకా ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు సోలిపేట సతీష్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ జనగామ రాములుగౌడ్, గౌడ సంఘం నాయకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బంగారు ముక్కుపుడక, పట్టుచీరను అందజేశారు. మహిళా భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కట్న కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీగా భక్తులు రావడంతో పరిసరాలు కిటకిటలాడాయి. జాతర సందర్భంగా రహదారిపై ట్రాఫిక్ జాం కావడంతో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ఫంక్షన్ హాల్ నిర్వాహకుడు వెంకట్‌రెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాములు గౌడ్, గౌడ కులస్తులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, సుభాష్‌రెడ్డి, నాయిని రాజ్‌గోపాల్, రణం శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ రజనక్ ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు కుమ్మరి శ్రీనివాస్, కొటారి అశోక్, కానుగంటి లచ్చయ్య, తానీషా నాయకులు విశ్వేశ్వర్, సోమ సత్యనారాయణ, అలీ, డిష్ రాజు, పులబోయిన రవి, అన్నం రవి, సుదర్శన్, తహసీల్దార్ నారాయణ, ఆర్‌ఐలు జైభారత్‌రెడ్డి, సంతోష్, సర్వేయర్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే రిజర్వేషన్ కౌంటర్లకు మంగళం

## పోస్టాఫీసుల్లోని రిజర్వేషన్ కౌంటర్ల ఎత్తివేతకు రంగం సిద్ధం

- సంగారెడ్డి, సదాశివపేటలో రిజర్వేషన్లు నిలుపుదల
- త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం
- కేంద్రప్రభుత్వ తీరుపై జనం ఆగ్రహం
- ఎంపీలు పట్టించుకోవాలని విజ్ఞప్తి



సంగారెడ్డి పట్టణంలోని పోస్టాఫీసు

సంగారెడ్డి, జనవరి 29(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాకు రైల్వేలైన్ మంజూరు చేయకపోగా జిల్లాలోని రైల్వే రిజర్వేషన్ కౌంటర్లను ఎత్తివేసేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధమవుతున్నది. సంగారెడ్డి వరకు మెట్రోరైలు విస్తరిస్తామని, సంగారెడ్డి జిల్లాకు రైల్వేలైన్ తీసుకువస్తామని ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థులు ప్రచారం చేశారు. బీజేపీని గెలిపిస్తే సంగారెడ్డి జిల్లాకు మెట్రో, రైల్వేలైన్ వస్తుందని ఆశపడిన జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఓటర్లు కమలం పార్టీకి ఓట్లు వేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఓటర్లు బీజేపీని గెలిపించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది సమీపిస్తున్నా సంగారెడ్డి జిల్లాకు కొత్త రైల్వేలైన్, మెట్రో రైలుకు మోక్షం రాలేదు. ఇప్పుడు ఏకంగా జిల్లాలోని రైల్వే రిజర్వేషన్ కౌంటర్లను ఎత్తివేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. రైల్వేలైన్‌ను నోచుకోని జిల్లా ప్రజలకు రైలు ప్రయాణాన్ని సైతం దూరం చేస్తున్నది. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, జోగిపేట పోస్టాఫీసుల్లో ఉన్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్లను సౌత్ సెంట్రల్ రైల్వే ఎత్తివేసేందుకు సిద్ధమైందని, త్వరలోనే ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది. ఇది వరకే సంగారెడ్డి, జోగిపేట పోస్టల్ సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్న రైల్వే టికెట్ బుకింగ్ సేవలను రైల్వేశాఖ నిలిపివేసింది. దీంతో రైలు ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో చాలామంది టికెట్లు లభించడం లేదు. దీంతో చాలామంది ప్రయాణికులు అదనంగా డబ్బులు వెచ్చింది ట్రావెల్ ఏజెంట్ల ద్వారా రైలు టికెట్లు కొనుక్కుంటున్నారు.

### మొదటి నుంచి జిల్లాపై రైల్వేశాఖ శీతకన్ను

రైల్వేశాఖ మొదటి నుంచి సంగారెడ్డి జిల్లాపై శీతకన్ను చూపుతున్నది. సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ మీదుగా రైల్వేలైన్ ఉంది. సంగారెడ్డి, జోగిపేట,నారాయణ ప్రాంతం గుండా రైల్వేలైన్ వేయాలని ఈ ప్రాంత ప్రజలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా జిల్లా ప్రజల రైల్వేకల నెరవేరడం లేదు. ప్రతి పార్లమెంట్ ఎన్నికల్లో రైల్వే అంశం ప్రచారానికి పరిమితం అవుతున్నది తప్పా ఆచరణకు నోచుకోవడం లేదు. గతంలో సంగారెడ్డి, అందోలు, నారాయణఖేడ్ ప్రాంత ప్రజలు రైల్ రిజర్వేషన్ కోసం లింగంపల్లి రైల్వేస్టేషన్ లేదా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సి వచ్చేది. కనీసం సంగారెడ్డిలో రైల్ టికెట్ రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని దీంతో జిల్లా ప్రజలు డిమాండ్ చేశారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే 2010లో సంగారెడ్డి ఐటీఐలో టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత కొంతకాలానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆ కౌంటర్‌ను ఎత్తివేశారు. రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కోసం సంగారెడ్డి ప్రజలు తిరిగి డిమాండ్ చేయడంతో పోస్టాఫీసుల్లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల ఏర్పాటుకు దక్షిణ మధ్య రైల్వే ముందుకు వచ్చింది. 2013–14లో జోగిపేట పోస్టాఫీసులో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రారంభించింది. 2014–15లో సంగారెడ్డిలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్లను ఏర్పాటు చేసింది. పోస్టాఫీసు సిబ్బంది ద్వారా వీటి నిర్వహణ జరుగుతుంది. సంగారెడ్డి ప్రాంతం నుంచి వివిధ ప్రాంతాలకు రైలులో ప్రయాణించే ప్రజలు జోగిపేట, సంగారెడ్డి పోస్టాఫీసుల్లో ముందస్తుగా టికెట్లు తీసుకునేవారు. అలాగే తత్కాల్ టికెట్లు కొనుగోలు చేసేవారు. సంగారెడ్డి ప్రాంతంలో ప్రయాణికులతో పాటు వివిధ పరిశ్రమల్లో పనిచేసే ఉత్తరాదికి చెందిన కార్మికులు, ఆర్మీ అధికారులు, సిబ్బంది, సంగారెడ్డి పోస్టాఫీసులో రైల్వే రిజర్వేషన్ చేసుకునేవారు. దక్షిణ మధ్య రైల్వే సంగారెడ్డి, జోగిపేట పోస్టాఫీసుల్లోని రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల మూసివేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. సంగారెడ్డి, జోగిపేట పోస్టాఫీసుల్లోనూ కొద్దిరోజులుగా రైలు రిజర్వేషన్ సేవలను నిలిపివేసింది. రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల ఎత్తివేసేందుకు సంబంధించి త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ఇదే జరిగితే ఈ ప్రాంత ప్రజలు లింగంపల్లి, సికింద్రాబాద్ వెళ్లి తత్కాల్, ఇతర టికెట్లు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో రైలు టికెట్లు రిజర్వు చేసుకోవడం ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతుంది. ప్రైవేటు ట్రావెల్ ఏజెంట్ల దగ్గర రైలుటికెట్లు కొనుగోలు చేయడం ప్రయాణికులకు అదనపు భారం అవుతుంది. రైల్వే రిజర్వేషన్ కౌంటర్లను యథావిధిగా కొనసాగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సోయా పైసల్ ఇంకా పడలే..

- పంట విక్రయించి రెండు నెలలైనా రైతులకు అందని డబ్బులు
- పొంతనలేని సమాధానం ఇస్తున్న మార్కెట్ అధికారి
- ఆర్థిక ఇబ్బందుల్లో రైతులు

కంగ్టి, జనవరి 29: సోయా పంట విక్రయించి రెండు నెలలు కావస్తున్నా డబ్బులు ఇంకా ఖాతాల్లో పడకపోవడంతో రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని బోర్గి, చౌకన్‌పల్లి, భీంరా, నాగూర్(కె), నాగూర్(బీ), దెగుల్‌వాడి, తుర్కవడగామ తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో రైతులు సోయా సాగుచేశారు. ఎకరాకు 5 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో సోయా ధరలు గణనీయంగా పడిపోవడంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించారు. విక్రయించిన వారంలోపే డబ్బులు ఖాతాల్లో జమవుతాయని అధికారులు చెప్పడంతో రైతులు అక్కడ సోయాను అమ్మారు. పంట అమ్మి రెండు రోజులు కావస్తున్నా ఇంకా డబ్బులు చెల్లించడం లేదు. ఇటు సోయా అమ్మిన పైసలు రాక, అటు రైతుభరోసా ప్రభుత్వం వేయక పోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బయట అప్పులు తెచ్చి యాసంగి సాగుచేసుకున్నారు. ఈ విషయమై మార్కెట్ అధికారి ప్రభును పలుసార్లు అడిగితే పొంతనలేని సమాధానం ఇస్తున్నాడని రైతులు తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి రైతులకు డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### అప్పుచేసి పంట పండించాం..



ప్రభుత్వం ఈ ఏడాది రైతుభరోసా వేయకపోవడంతో పంట పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వద్ద అప్పుచేసి సోయాపంటను పండించాం. బయట సోయాపంట ధర తక్కువగా ఉండడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాం. విక్రయించి రెండు నెలలైనా మాకు ఇప్పటి వరకు డబ్బులు రాలేదు. మాకు చాలా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. అధికారులు తొందరగా మాకు డబ్బులు చెల్లించాలి. –వెంకట్‌రావు, రైతు, బోర్గి

### పంట అమ్మి రెండు నెలలైంది..



పండించిన సోయా పంటను 30 కిలోమీటర్ల దూరం తీసుకెళ్లి మనూరులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాం. 24గంటల తర్వాత అధికారులు కాంటా చేశారు. పంట అమ్మి రెండు నెలలు కావస్తున్నా డబ్బులు చెల్లించలేదు. వెంటనే మా డబ్బులు మాకు అందించాలి. –సాయిలు, రైతు, బోర్గి